
సాక్షి ఆదిలాబాద్

శనివారం : 25 : మే : 2024



లోకారి(బి)లో 20 మందికి అస్వస్థత

గాదిగూడ మండలం లోకారి(బి) గ్రామంలో శుక్రవారం 20 మందికి వాంతులు, విరేచనాలయ్యాయి. పరిస్థితి విషమించగా వారిని రిమ్స్‌కు తరలించారు. 8లో▸



లాంగ్ ట్రిప్.. లైవ్ డ్రాయింగ్

చెన్నూర్ మండల కేంద్రానికి చెందిన ఏల్పుల పోచం కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కళాయాత్ర చేపట్టారు. ఈ యాత్ర వచ్చే నెలలో ముగియనుంది. 8లో▸

గరిష్టం/కనిష్టం
43.0 /31.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు షురూ



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం పరీక్ష కొనసాగింది. జనరల్, ఒకేషనల్ కలిపి 1,398 మంది హాజరు కావాల్సి ఉండగా, 1,311 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్ష కొనసాగింది. ఈ పరీక్షకు 529 మందికి గాను 482 మంది హాజరయ్యారు. 47 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో రవీందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు.

ప్రశాంతంగా పాలిసెట్



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించిన పాలిసెట్ శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. పాలిటెక్నిక్‌తో పాటు హార్టికల్చర్, వెటర్నరీ, ఫిషరీస్ డిప్లొమోలో ప్రవేశాల కోసం ఈ పరీక్ష నిర్వహించారు. జిల్లా కేంద్రంలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష కొనసాగింది. నిమిషం నిబంధన ఉండడంతో విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. మొత్తం 1,059 మందికి గాను 939 మంది (88.66 శాతం) హాజరయ్యారు. ఇందులో బాలురు 531, బాలికలు 408మంది పరీక్ష రాసినట్లు పాలిసెట్ జిల్లా సమన్వయకర్త భరద్వాజ తెలిపారు.

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన



సీసీ ఫుటేజీలో భద్రతను పరిశీలిస్తున్న కలెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టర్ రాజర్షిషా శుక్రవారం పరిశీలించారు. పట్టణంలోని టీటీడీసీ, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలల్లోని స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేశారు. పోలీసు భద్రతను పరిశీలించారు. ముందుగా స్ట్రాంగ్ రూమ్ వద్ద గల రిజిస్టర్‌లో సంతకం చేసి పోలీసులతో మాట్లాడారు. అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు.

ఏజెన్సీలో విద్యుత్ సమస్య తలెత్తకుండా చర్యలు



గాదిగూడలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న ఎస్ఈ చౌహాన్

నార్నూర్: ఏజెన్సీతో పాటు జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సమస్య తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు ఆ శాఖ ఎస్ఈ చౌహాన్ అన్నారు. గాదిగూడ మండలంలో శుక్రవారం ఆయన పర్యటించారు. లోకారి (కె) గ్రామంలో ఉన్న 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. పలు రికార్డులను పరిశీలించి విద్యుత్‌శాఖ సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం గాదిగూడలో నూతనంగా ఏర్పాటు చేయనున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలోని గిరి గ్రామాలకు మెరుగైన విద్యుత్ సౌకర్యం అందించాలనే దృక్పథంతోమారుమూల మండలమైన గాదిగూడలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదించినట్లు తెలిపారు. ఆయన వెంట సిబ్బంది తదితరులున్నారు.

ఇసుక దందాలో.. అలయ్ బలయ్!



సాక్షి,ఆదిలాబాద్: బేల మండలం కాంగార్‌పూర్ పెన్‌గంగ నదిలోని ఇసుక క్వారీ ఇప్పుడు జిల్లాలోనే పెద్దది. ఇక్కడ ఇసుక ఎక్కువగా లభ్యమయ్యే పరిస్థితి ఉండడంతో వేలంలో ఏడాదికి ఏకంగా రూ.62 లక్షలు గ్రామ అభివృద్ధి కమిటీ(వీడీసీ)కి చెల్లిస్తున్నారంటే అర్థం చేసుకోవచ్చు. నాలుగేళ్లుగా ఇక్కడ ఇసుక తవ్వకాలు చేపట్టలేదు. ఈ ఏడాది నుంచే క్వారీ మొదలైంది. దీంతోనే పెన్‌గంగ పరీవాహక ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న అన్ని క్వారీలతో పోల్చితే అధిక వేలం పలికింది. రెండు రాష్ట్రాల సరిహద్దుగా ఉండే పెన్‌గంగ నది కాంగార్‌పూర్ వద్ద అడ్డంలో విస్తీర్ణం అమితంగా ఉండడం, ఏళ్లుగా ఇక్కడ తవ్వకాలు చేపట్టకపోవడంతో అధికంగా నిక్షిప్తాలు పెరిగాయి. ఈ నేపథ్యంలోనే దీనిపై పెద్దల కన్ను పడింది.

- రాజకీయంగా ప్రత్యర్థులు.. వ్యాపారంలో చెట్టాపట్టాల్
- కాంగార్‌పూర్ క్వారీలో ఇద్దరు ముఖ్య నేతల వారసులు
- మహారాష్ట్ర నుంచి సమస్య రాకుండా ప్రజాప్రతినిధి ద్వారా చొరవ

ప్రధాన పార్టీల నేతలు..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ ఆదిలాబాద్ నియోజకవర్గంలో బీజేపీ ప్రాతినిధ్యం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంగార్‌పూర్‌లో ఇసుక క్వారీ నిర్వహించిన పక్షంలో ఇక్కడ ప్రత్యర్థుల విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఓ ఆలోచన చేశారు. ఇందులో భాగంగానే కమలం పార్టీలో ఓ ముఖ్యనేత వారసుడిని స్లీపింగ్ పార్టనర్‌గా తీసుకున్నారనే ప్రచారం ఉంది. పెన్‌గంగ నది తెలంగాణ, మహారాష్ట్రకు సరిహద్దుగా ఉంది. ఈ నేపథ్యంలో తెలంగాణ వైపు క్వారీ నిర్వహించడంలో ఇక్కడి వారందరిని మేనేజ్ చేసుకున్నప్పటికీ అటు మహారాష్ట్ర వైపు ఇసుక తీసినప్పుడు సమస్యలు వస్తే నివారించడానికి ఇది ఉపయుక్తంగా ఉంటుందని, దీంట్లో ఆ నేత వారసుడికి పార్టనర్‌షిప్ ఇచ్చారని ప్రచారంలో ఉంది. అంతే కాకుండా బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు జిల్లా, మండలస్థాయి నాయకులు కూడా ఇందులో భాగస్వాములనే ప్రచారం సాగుతుంది. దీనిపై ప్రజల్లో భిన్నమైన ప్రచారం సాగుతుంది. తెల్లవారితే రాజకీయంగా ఒకరిపై మరొకరు దుమ్మెత్తి పోసుకునే వీరు ఇసుక అక్రమ దందా వ్యాపారంలో అలయ్..బలయ్ మాదిరిగా చెట్టాపట్టాలేసుకొని సాగడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆ ముఖ్య నేత వారసుడి నిర్వహణ..

ఏడాదిలో కోట్ల రూపాయలు సంపాదించేందుకు ఈ క్వారీ అనువుగా ఉండడంతో దీనిపై పలువురు నజర్ పెట్టారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి చెందిన ఉమ్మడి జిల్లా స్థాయి పదవిలో ఉన్న ఓ ముఖ్య నేత కుమారుడు గతం నుంచి ఇసుక క్వారీల నిర్వహణ చేస్తున్నాడు. కాంగార్‌పూర్ క్వారీని కూడా ఆయనే హస్తగతం చేసుకున్నాడు. ఈ గ్రామస్థాయిలో ఉన్న వివిధ పార్టీలకు చెందిన కొంత మందిని ఇందులో భాగస్వాములుగా చేసుకొని అక్రమంగా నిర్వహణ చేస్తున్నారు. పెన్‌గంగలో ఇసుక లభ్యత లేకున్నప్పటికీ రాజకీయ పలుకుబడి ద్వారా యథేచ్ఛగా దాన్ని కొల్లగొడుతున్నారు. రాష్ట్రంలో ఓ వైపు ఇసుక పాలసీలో అక్రమాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి క్షేత్రస్థాయిలో ఆదేశాలు జారీ చేస్తున్నారు. మరోపక్క జిల్లాలో మాత్రం ఆ పార్టీకి చెందిన ముఖ్య నేతే ఇసుక క్వారీల నిర్వహణలో కీలకపాత్ర వహిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎక్కువ మంది ఆ గూటికే..

పెన్‌గంగ పరీవాహక ప్రాంతాల్లో సుమారు 12 నుంచి 15 చోట్ల ఇసుక క్వారీల నిర్వహణ సాగుతుంది. గతంలో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పలువురు ఆ పార్టీ నాయకులే ఈ క్వారీల నిర్వహణ పరంగా కీలకంగా వ్యవహరించారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో ఆ నాయకులంతా ఇప్పుడు హస్తం గూటికే చేరుతున్నారనే ప్రచారం సాగుతుంది. ప్రధానంగా ఈ అక్రమ దందా నిర్వహించాలంటే అధికార పార్టీ అయితేనే అన్ని సాధ్యమవుతుందని ఇలా చేస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. ప్రధానంగా ఈ అక్రమ దందా నిర్వహించినప్పుడు మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖల అండదండలు కావాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే అధికార పార్టీలో ఉంటేనే ఇదంతా సాధ్యమవుతుందనే భావనలో నాయకులు ఉన్నారు.

నకిలీ బీజీ–3 దందా

జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ ప్రాంతంలో గల ఓ గోదాంలో నకిలీ విత్తన ప్యాకెట్లు తయారు చేస్తున్న ముఠాను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. కర్ణాటక నుంచి పెద్ద మొత్తంలో దిగుమతి చేసిన లూజ్ విత్తనాలను బ్రాండెడ్ కంపెనీల పేరిట ప్యాకింగ్ చేస్తుండగా పట్టుకొని వాటిని సీజ్ చేశారు. వీటి విలువ సుమారు రూ.19.40లక్షల వరకు ఉంటుందని అధికారులు వెల్లడించారు.

- నిషేధం ఉన్నా గుట్టుగా విక్రయాలు
- ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి
- బ్రాండెడ్ పేర్లతో ప్యాకింగ్
- ఏజెంట్ల ద్వారా ఏజెన్సీ గ్రామాల్లోకి సరఫరా



జిల్లా కేంద్రంలోని గోదాంలో లూజ్ విత్తనాలను పరిశీలిస్తున్న అధికారులు

ఇచ్చోడ: జిల్లాలో నకిలీ బీజీ-3 విత్తన దందా జోరుగా సాగుతోంది. ఈ విత్తనాలను ప్రభుత్వం నిషేధించినా కొంతమంది వీటి విక్రయాలు గుట్టుగా సాగిస్తున్నారు. ఏటా ఏప్రిల్, మే నెలల్లో ఇతర రాష్ట్రాల నుంచి ఉమ్మడి జిల్లాకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈనెల 13 వరకు జిల్లా సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఉండడంతో వీటి రవాణాకు కొంతమేర బ్రేక్ పడింది. తాజాగా వాటిని ఎత్తివేయడంతో అక్రమార్కులు మళ్లీ తమ దందా ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది.

ఏజెన్సీ మండలాల్లో..

నిషేధిత బీజీ-3 పత్తి విత్తనాలను ఎక్కువగా ఏజెన్సీ మండలాల్లోని రైతులకు అంటగడుతున్నట్లు సమాచారం. మండల కేంద్రాల్లో కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో వీటిని డంప్ చేసి గిరిజన రైతులకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సారి డిమాండ్ రకం పత్తి విత్తనాల కొరతను తమకు అనుకూలంగా మార్చుకొని ఏజెంట్ల ద్వారా రైతులకు విక్రయిస్తున్నట్లు సమాచారం.

అధికారుల తనిఖీలు..

నకిలీ విత్తనాల విషయంలో కఠిన చర్యలకు సైతం వెనుకాడేది లేదని కలెక్టర్ రాజర్షి షా ఇటీవల స్పష్టం చేశారు. టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు అధికారులు ఆయా ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేస్తుండగా.. తాజాగా జిల్లా కేంద్రంలో భారీ మొత్తంలో నకిలీ విత్తనాలు పట్టుబడడం గమనార్హం.

టాస్క్‌ఫోర్స్ బృందాలతో తనిఖీలు

నకిలీ బీజీ-3 విత్తనాల ఆచూకీ కోసం జిల్లావ్యాప్తంగా టాస్క్‌ఫోర్స్ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాయి. నకిలీ విత్తనాలు తయారు చేసినా, విక్రయించినా వారిపై పీడీయాక్టు నమోదు చేస్తాం.

డీఏవో, పుల్లయ్య

జిల్లా కేంద్రంలో భారీగా నకిలీ విత్తనాలు పట్టివేత

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ ప్రాంతంలో గల ఓ గోదాంలో అక్రమంగా నకిలీ విత్తన ప్యాకెట్లు తయారు చేస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఈమేరకు వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి శుక్రవారం ఉమ్మడిగా దాడి చేశారు. రాష్ట్రంతో పాటు వివిధ రాష్ట్రాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఈ విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. లూజ్‌గా కర్ణాటక నుంచి తీసుకువచ్చిన ఈ విత్తనాలను గోదాంలో బ్రాండెడ్ కంపెనీల పేరిట తయారు చేస్తూ రైతులకు అంటగడుతున్నారు. మీనాక్షి గోల్డ్, పాండురంగ, జే-16, వైట్‌కింగ్, పుడమి, వివిధ రకాల బ్రాండెడ్ కంపెనీల పేరిట పత్తి ప్యాకెట్లలో నకిలీ విత్తనాలను ప్యాక్ చేస్తూ ఇతర ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉంచారు. విషయం పోలీసుల దృష్టికి రావడంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు గోదాంపై దాడి చేసి విత్తన బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు. 500కిలోల లూజ్ విత్తనాలు లభ్యమైనట్లు ఆదిలాబాద్‌అర్బన్ వ్యవసాయ అధికారి రమేశ్ పేర్కొన్నారు. వీటి విలువ రూ.19.40 లక్షల వరకు ఉంటుందని వివరించారు. విత్తనాలతో పాటు గోదాంను సైతం సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. అశోక్ రెడ్డి అనే వ్యక్తిపై కేసు నమోదు కాగా, పూర్తిస్థాయిలో విచారణ చేపట్టనున్నట్లు వివరించారు. ఈ దాడుల్లో మావల ఎస్సై విష్ణువర్ధన్, ఎస్బీ పోలీసులు పాల్గొన్నారు.

బడి పనులు త్వరగా పూర్తి చేయాలి



మహాలక్ష్మివాడ పాఠశాలలో చేపడుతున్న భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

- కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్‌టౌన్: పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి బడుల పనులు పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మివాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపడుతున్న పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అమ్మ ఆదర్శ కమిటీలకు సంబంధించి నిధులు విడుదల చేశామన్నారు. ఆయా పాఠశాలల్లో చేస్తున్న మైనర్ రిపేర్లు, ఫ్లోరింగ్, తాగునీరు, కంపౌండ్‌వాల్, తదితర పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలల్లో ఎల్ఈడీ బల్బులను వాడాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని డీఈవో ప్రణీతను ఆదేశించారు. కలెక్టర్ వెంట విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి నారాయణ, డీఆర్డీవో సాయన్న, మండల విద్యాధికారి జయశీల, ప్రధానోపాధ్యాయులు కిషన్ తదితరులున్నారు.

జూన్ మొదటి వారంలోనే యూనిఫాం అందజేయాలి

ఇచ్చోడ: జూన్ మొదటి వారంలోగా స్కూల్ యూనిఫాం ఒక్కో జత సిద్ధం చేసి సంబంధిత శాఖ అధికారులకు అందజేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి టైలరింగ్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులతో యూనిఫాం తయారు చేస్తున్న విధానం అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపడుతున్న పనులను పరిశీలించారు. ఇందులో డీఈవో ప్రణీత, డీఆర్డీవో సాయన్న, తహసీల్దార్ తుకారాం, ఎంపీడీవో లక్ష్మణ్, ఎంఈవో ఉదయ్‌రావు, పంచాయతీరాజ్ ఏఈ అభినవ్, ఐకేపీ ఏపీఎం దయాకర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

ఆదిలాబాద్‌టౌన్: రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో గల జొన్నల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. సేకరించిన ధాన్యాన్ని వెంటనే లారీల్లో లోడ్ చేయించాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాల వద్ద సరిపడా హమాలీలను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో ఇప్పటివరకు 3415 మంది రైతులకు సంబంధించి 82వేల క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేసినట్లు తెలిపారు.ఇంకా 15వేల క్వింటాళ్ల వరకు జొన్నలు రావచ్చని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ధాన్యం తడవకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా సహకార అధికారి మోహన్, మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కల్వర్టు నిర్మించాలని కలెక్టర్‌కు వినతి

ఇచ్చోడలో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు పనుల్లో భాగంగా సిరిచెల్మ చౌరస్తా వద్ద అదనంగా పైపులైన్ కల్వర్టు నిర్మించాలని టీచర్స్‌కాలనీ వాసులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు.

ప్రైవేట్ బస్సు.. డేంజర్!

ఆదిలాబాద్ వయా నిర్మల్ నుంచి హైదరాబాద్‌కు బుధవారం రాత్రి బయల్దేరిన ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు నిర్మల్ ఘాట్ సెక్షన్ సమీపంలో బోల్తా పడింది. డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం, ఓవర్ లోడ్ కారణంగా ఓ ప్రయాణికుడు మృత్యువాత పడగా, అందులో ప్రయాణిస్తున్న 25 మంది గాయాలపాలయ్యారు. మరో ముగ్గురు ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. ఈ ఘటన అర్ధరాత్రి చోటు చేసుకోవడంతో ప్రయాణికుల రోదనలు మిన్నంటాయి.

ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్, హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు వచ్చే ప్రైవేట్ ట్రావెల్స్‌లో ప్రతిరోజు బస్ టాప్‌పైన, వెనుక, కింది భాగంలో నిబంధనలకు విరుద్ధంగా గూడ్స్ తరలించడం సర్వసాధారణంగా మారింది. రవాణాశాఖ అధికారులకు ఇదంతా తెలిసినా 'మామూలు'గా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.



నిర్మల్ వద్ద బుధవారం రాత్రి ప్రమాదానికి గురైన ప్రైవేట్ బస్సు

- కానరాని ఫిట్‌నెస్.. అనుభవం లేని డ్రైవర్లు
- నిబంధనలు పాటించని యజమానులు
- ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం
- 'మామూలు'గా వ్యవహరిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: ప్రైవేట్ బస్సు ప్రయాణం సురక్షితమేనా అనే అనుమానం వ్యక్తమవుతుంది. కాలం చెల్లిన ఫిట్‌నెస్ లేని డొక్కు బస్సులు.. అనుభవం లేని డ్రైవర్లు.. నిబంధనలు పాటించని యజమానుల కారణంగా ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. వారు చేసే తప్పిదంతో తాజాగా ఓ కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. ధనార్జనే తప్పా ప్రయాణికుల ప్రాణాలు వారికి లెక్కలేకుండా పోతోంది. ప్రతిరోజు వేకువజామున 4 గంటల ప్రాంతంలో, రాత్రి 9 నుంచి ఒంటిగంట వరకు జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్‌కు ప్రైవేట్ బస్సులు నడుపుతున్నారు. అక్కడినుంచి తిరిగి జిల్లా కేంద్రానికి ప్రయాణికులను తీసుకొస్తున్నారు. కొన్ని బస్సులు మినహా చాలా వరకు కాలం చెల్లినవే ఉన్నాయి. నిర్మల్ ఘాట్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మరణించారు. అందులో 49 మంది వరకు ప్రయాణించినట్లు సమాచారం. రవాణాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రైవేట్ బస్సుల యజమానులు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్న చందంగా సాగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కాలం చెల్లిన బస్సులతో..

ఆదిలాబాద్ నుంచి ప్రతిరోజు 20 వరకు ప్రైవేట్ బస్సులు హైదరాబాద్‌కు వెళ్తుంటాయి. అలాగే హైదరాబాద్ నుంచి కూడా అదే సంఖ్యలో జిల్లా కేంద్రానికి వస్తుంటాయి. వీటితో పాటు మహారాష్ట్ర, ఇతర ప్రాంతాలకు చెందిన బస్సులు సైతం జిల్లా ప్రయాణికులను తరలిస్తుంటారు. అలాగే మరో 97 కాంట్రాక్ట్ క్యారేజీ బస్సులు ఉన్నాయి. ప్రైవేట్ బస్సుల్లో ఎక్కువగా కాల పరిమితి దగ్గరగా ఉన్నవే ఉన్నాయి. చాలా వాటిలో అరిగిన టైర్లు, సరిగా ఉండని అద్దాలే దర్శనమిస్తాయి. అయినా ఏసీ పేరిట వీడియోకోచ్, తదితర సౌకర్యాలు ఉన్నట్లు చెప్పి టికెట్లు బుక్ చేసుకుంటారు. బస్సు ఎక్కే సరికి ప్రయాణికులకు చుక్కలు కనిపిస్తాయి. తీరా చేసేదేమి లేక అదే డొక్కు బస్సుల్లో గమ్యస్థానాలకు చేరుకోవాల్సిన దుస్థితి.

గూడ్స్ తరలింపే వారి ధ్యేయం..

నిబంధనల ప్రకారం ప్రయాణికులను తరలించే బస్సుల్లో గూడ్స్ తీసుకెళ్లడం చట్టరీత్యా నేరం. అయినప్పటికీ కాసులకు కక్కుర్తిపడి ప్రైవేట్ బస్సుల యజమానులు బస్సుల్లో పెద్ద ఎత్తున గూడ్స్ తరలిస్తున్నారు. ప్రయాణికుల పరిమితితో పాటు గూడ్స్ తరలిస్తుండడంతో ఆ బస్సులు ఎక్కడ బోల్తాపడతాయోనన్న భయాందోళన ప్రయాణికుల్లో నెలకొంటుంది. బుధవారం జరిగిన ఘటన ఇదే కోవలోకి వస్తుంది. గతంలోనూ ఓ ప్రైవేట్ బస్సు నిర్మల్ ప్రాంతంలో బోల్తా పడింది. పదేపదే ఘటనలు చోటు చేసుకుంటున్నా రవాణా శాఖ అధికారులు పట్టింపు లేనట్టుగా వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నప్పుడు హడావుడి చేయడమే తప్పా మళ్లీ 'మామూలు'గానే తీసుకుంటున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఇటు ప్రయాణికుల చార్జీలతో పాటు అటు గూడ్స్ తరలించి లక్షల్లో ఆర్జిస్తున్నారు. ప్రయాణికుల ప్రాణాల గురించి పట్టించుకోకుండా గ్యాస్ సిలిండర్లు, గంజాయి, తదితర మత్తు పదార్థాలు సైతం ఇందులో తరలిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు.

తనిఖీలు కరువు..

రవాణాశాఖ అధికారులు ఎప్పటికప్పుడు ప్రైవేట్ బస్సులను తనిఖీలు చేయాల్సి ఉండగా అటువైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలున్నాయి. వారి నిర్లక్ష్యం.. ప్రయాణికుల ప్రాణాల మీదికి వస్తోంది. ప్రతి బస్సులో ఇద్దరు డ్రైవర్లు ఉండాల్సి ఉండగా, ఒక్కరితోనే ప్రయాణం కానిచ్చేస్తున్నారు. ఫస్ట్‌ఎయిడ్ బాక్స్‌లో ఉండాల్సిన మెడికల్ కిట్ ఏ బస్సులోనూ కనిపించదు. ఫైర్ పరికరాలు మచ్చుకు కానరావు. ఎమర్జెన్సీ ఎగ్జిట్ డోర్లు సైతం అంతంతే. వీటికి తోడు అనుభవం లేని డ్రైవర్లతో ప్రయాణికులను తరలిస్తున్నా అధికారుల తనిఖీలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. రవాణా శాఖలో ఇదివరకు రెగ్యులర్ డీటీసీ ఉండగా, ఆయన వరంగల్‌కు బదిలీపై వెళ్లారు. అప్పటినుంచి నిజామాబాద్ జిల్లాకు చెందిన అధికారి ఇన్‌చార్జిగా ఉన్నారు. రెగ్యులర్ అధికారి లేకపోవడంతో ప్రస్తుతం పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలున్నాయి. ఈ విషయమై 'సాక్షి' ఆ శాఖ అధికారుల వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా వారు అందుబాటులోకి రాలేదు.

క్లుప్తంగా

గొర్రెల మందపై కుక్కల దాడి



కడ్తాల్‌లో మృతి చెందిన గొర్రెలు

సోన్‌: మండలంలోని కడ్తాల్‌ గ్రామంలో గొర్రెల మందపై వీధి కుక్కలు దాడి చేశాయి. బాధితుడు అరిగెల వెంకటేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం వెంకటేశ్‌ తన గొర్రెలను మేత కోసం బయటకు తీసుకెళ్లాడు. కొన్నింటిని ఇంటి సమీపంలోని షెడ్డులో ఉంచాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం ఒక్కసారిగా వీధి కుక్కలు మందలోకి చొరబడి గొర్రెలపై దాడి చేయగా ఆరు జీవాలు మృత్యువాతపడ్డాయి. సుమారు రూ.35 వేల నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు. రెండు నెలలుగా గొర్రెల మందలపై వీధి కుక్కలు దాడి చేయగా సుమారు 30 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గ్రామంలో వరుస ఘటనలు చోటు చేసుకోవడంతో గొర్రెల కాపరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కలను అరికట్టాలని గతంలో అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వీధి కుక్కల బెడదను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సరిహద్దు గొడవలో ఒకరు మృతి

ఉట్నూర్‌రూరల్‌: మండల కేంద్రంలోని పాత ఉట్నూర్‌లో ఇంటి స్థల సరిహద్దు వివాదంలో జరిగిన గొడవలో ఒకరు మృతిచెందారు. రెవెన్యూ ఉద్యోగి రాథోడ్‌ మోహన్‌ (45) ఇంటి సమీపంలో ఉన్న దర్శిని రాజు, ఆయన భార్య హరిత ఇంటికి సరిహద్దు స్థలం వద్ద బుధవారం మోహన్‌తో గొడవకు దిగారు. ఈ వివాదంలో రాజు బండరాయితో మోహన్‌ను కొట్టడంతో తలకు తీవ్ర గాయమై కోమాలోకి జారుకున్నాడు. మోహన్‌ను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మోహన్‌ను హైదరాబాద్‌ ఆస్పత్రికి తరలించగానే పోలీసులు గొడవకు కారణమైన రాజు, హరితను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని హైదరాబాద్‌ నుంచి ఉట్నూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. ఉట్నూర్‌ డీఎస్పీ నాగేందర్‌, సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌ మొగిలి ఆధ్వర్యంలో ఉట్నూర్‌ ఎస్సై మనోహర్‌ అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. మృతుడి కుమారుడు నితీశ్‌ ఫిర్యాదు మేరకు హరిత, రాజును అదుపులో తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బెయిల్‌పై విడుదల

కడెం: మండలంలోని కొత్తమద్దిపడగ గ్రామంలోని అటవీ నర్సరీలో మొక్కలు ధ్వంసం చేసిన 16మందిని శుక్రవారం బెయిల్‌పై విడుదల చేసినట్లు కడెం ఎఫ్‌ఆర్వో అనిత తెలిపారు. ఇటీవల వడ్ల కల్లం కోసం స్థలం కావాలని అటవీ నర్సరీలోకి చొరబడి మొక్కలు ధ్వంసం చేసినందుకు సుప్రీంకోర్టు సూచన మేరకు 16మందికి నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు. అటవీ చట్టాలపై అవగాహన లేనందున అలా ప్రవర్తించామని, ఒకరిద్దరు జామీను ఇవ్వడంతో కండిషనల్‌ బెయిల్‌ మీద వారిని విడుదల చేశామని తెలిపారు. అటవీ వన్యప్రాణి సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

CHANGE OF NAME

■VEYEEGANDLA HARI KRISHNA S/o. VENKATESHWARLU R/o. H.No. 2-131/1 Rendlaguda (V), Jannaram (M), Manchiryal (D). Have Changed my Name as VEYIGANDLA HARIKRISHNA S/o. VENKATESHWARLU

[Z-1080768]

WANTED

■ప్రముఖ కంపెనీలో పార్ట్‌ టైం మాన్యువల్‌ రైటింగ్‌ వర్క్‌ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్‌ 3500/- మీ పేరు, అడ్రస్‌ కాల్‌/ వాట్సప్‌ చేయగలరు. 9502615217.

[M-1185088]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

లాంగ్‌ ట్రిప్‌.. లైవ్‌ డ్రాయింగ్‌

- దేశవ్యాప్త కళాయాత్ర చేపట్టిన ఆర్టిస్ట్‌
- మిత్రుల సాయంతో పోచం సాహసం
- చిత్రలేఖనం ప్రాముఖ్యత తెలిపేందుకే..
- ఎన్నో అవార్డులు, రికార్డులు సొంతం
- ముగియనున్న ఏడేళ్ల సుదీర్ఘ యాత్ర
- 7న కన్యాకుమారిలో ముగింపు సభ



ముగింపు సభ పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న పోచం



లైవ్‌ డ్రాయింగ్‌ వేస్తున్న పోచం

పోచం గీసిన చిత్రం (ఇన్‌సెట్‌లో)

చెన్నూర్‌: దేశ వ్యాప్తంగా వివిధ కళాప్రదర్శనలతో రికార్డులు సొంతం చేసుకున్న కళాకారులున్నారు. వివిధ యాత్రలు చేపట్టి గుర్తింపు తెచ్చుకున్నవారూ ఉన్నారు. ఇదే కోవలో చెన్నూర్‌ మండల కేంద్రానికి చెందిన ఏల్పుల పోచం లైవ్‌ డ్రాయింగ్‌లో రికార్డు సాధించాలని యాత్ర చేపట్టారు. కశ్మీర్‌ నుంచి కన్యాకుమారి వరకు కళాయాత్ర చేపట్టి రికార్డులకు ఎక్కనున్నారు. పోచం చేపట్టిన యాత్ర వచ్చే నెలలో ముగియనుంది. సామాన్య కుటుంబంలో జన్మించిన పోచం సాహసోపేత నిర్ణయం తీసుకుని దేశవ్యాప్తంగా కళాయాత్ర చేపట్టి విజయవంతంగా పూర్తి చేయనున్న సందర్భంగా ప్రత్యేక కథనం.

లైవ్‌ డ్రాయింగ్‌ ప్రాముఖ్యత తెలిపేలా..

లైవ్‌ డ్రాయింగ్‌ ప్రాముఖ్యతను దేశవ్యాప్తంగా నేటి తరానికి తెలియజేయాలనే ఉద్దేశంతో నిరుపేద కుటుంబానికి చెందిన మంచిర్యాల జిల్లా చెన్నూర్‌ పట్టణానికి చెందిన ఏల్పుల రాజక్క–లచ్చయ్య దంపతుల కుమారుడు పోచం అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకోనున్నారు. చిన్నప్పటి నుంచి డ్రాయింగ్‌పై మక్కువ ఉన్న పోచం డ్రాయింగ్‌ టీచర్‌ సత్యనారాయణ వద్ద ప్రాథమిక శిక్షణ పొందారు. స్నేహితుల సాయంతో చిత్రలేఖనంలో తనదైన ముద్ర వేసుకున్నారు. చిన్నప్పటి నుంచి చిత్రలేఖనంపై ఉన్న మక్కువ, స్నేహితులు పూసల సందీప్‌, పాశికంటి కుమార్‌ స్ఫూర్తితో హైదరాబాద్‌లోని తెలుగు యూనివర్సిటీలో బ్యాచిలర్‌ ఆఫ్‌ ఫైన్‌ ఆర్ట్స్‌ పూర్తిచేశారు. ఛత్తీస్‌గఢ్‌లో మాస్టర్‌ ఇన్‌ ఫైన్‌ ఆర్ట్స్‌ చదివారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో గల పబ్లిక్‌ స్కూల్‌లో రెండేళ్ల పాటు డ్రాయింగ్‌ టీచర్‌గా విధులు నిర్వర్తించారు. ఈ సమయంలోనే చిత్రలేఖనం ప్రాముఖ్యతను దేశానికి తెలియజేయాలని నిర్ణయించుకున్నారు. ఉద్యోగానికి రాజీనామా చేసి దేశంలోని అన్ని రాష్ట్రాలు, ప్రాంతాల యువతకు డ్రాయింగ్‌పై అవగాహన కల్పించేందుకు కంకణం కట్టుకున్నారు.

2017లో కళాయాత్రకు శ్రీకారం..

చిత్రలేఖనాన్ని దేశవ్యాప్తంగా పరిచయం చేయాలని సంకల్పించారు. మదిలో పుట్టిన ఆలోచన మేరకు 2017లో కశ్మీర్‌ నుంచి కన్యాకుమారి వరకు కళాయాత్రకు శ్రీకారం చుట్టారు. పోచం చేపట్టిన ఏడేళ్ల కళాయాత్ర చివరి ఘట్టానికి చేరుకుంది. యాత్ర ప్రారంభం నుంచి నేటి వరకు పోచం ఎన్నో రికార్డులు, అవార్డులు సొంతం చేసుకున్నారు. వివిధ రాష్ట్రాలు, విభిన్న సంస్కృతులు, మతాలు, కులాలకు అతీతంగా పోచం యాత్ర సాగుతోంది. చేతిలో చిల్లిగవ్వ లేకున్నా తన యాత్రకు ఎక్కడా ఆటంకం కలగకుండా అందరి సహకారం తీసుకుంటున్నారు. పట్టుదల ఉంటే లక్ష్య సాధన సాధ్యమని నిరూపించారు. ఆయా రాష్ట్రాల ప్రజలు, అధికారుల ఆదరణతో ఏడేళ్ల యాత్రను కొద్దిరోజుల్లో ముగించనున్నారు.

28 రాష్ట్రాలు.. 13 వేల చిత్రాలు..

28 రాష్ట్రాల్లో చేపట్టిన కళాయాత్రలో పోచం ఇప్పటి వరకు 13 వేలకు పైగా చిత్రాలు గీశారు. ఆయా రాష్ట్రాల సంస్కృతులు, సంప్రదాయాలకు అద్దంపట్టేలా చిత్రాలు గీసి అక్కడి అధికారులు, ప్రజల ప్రశంసలు అందుకున్నారు. ఎవరైనా పెడితే తిన్నారు.. లేదంటే పస్తులున్నారు.. కానీ.. యాత్రను ఎక్కడా ఆపలేదు. అస్సాంలో కాఫీ తోటల అందాలు, ఉత్తరప్రదేశ్‌లో బందిపోట్ల దాడిని కూడా తట్టుకుని యాత్రను కొనసాగించిన ఘనత పోచంకే దక్కింది.

దేశంలో యాత్ర సాగిందిలా..

కశ్మీర్‌ నుంచి కన్యాకుమారి వరకు 2017లో కళాయాత్ర ప్రారంభించిన పోచం 28 రాష్ట్రాలు, నాలుగు కేంద్ర పాలిత ప్రాంతాల్లో లైవ్‌ డ్రాయింగ్‌ ప్రాముఖ్యతను వివరించారు. యాత్రలో భాగంగా స్మారక కట్టడాలు, వారసత్వ ప్రదేశాలు తిలకించారు. ఎనిమిది జ్యోతిర్లింగాలు, తొమ్మిది అష్టశక్తి పీఠాలు సందర్శించారు. 24 దేశస్థాయి యూనివర్సిటీలు, ఫైన్‌ ఆర్ట్స్‌ కళాశాలల్లో లైవ్‌ డ్రాయింగ్‌పై అవగాహన కల్పించారు. 2,410 రోజుల యాత్ర చేపట్టి 30,700 కిలో మీటర్లు నడిచారు.

అవార్డులు, రికార్డులు..

పోచం చేపట్టిన కళాయాత్రను గుర్తించి లండన్‌ బుక్‌ ఆఫ్‌ వరల్డ్‌ రికార్డ్‌, ప్రెస్టీజీఎస్‌ బుక్‌ ఆఫ్‌ వరల్డ్‌ రికార్డు ప్రతిష్టాత్మక అవార్డులు అందజేశాయి. ఆయా దేశాల నుంచి పోచం ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

మిత్రుల సహకారంతోనే..

రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబంలో జన్మించిన పోచం ఉద్యోగం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకోవాల్సిన పరిస్థితి నుంచి సాహసోపేతమైన కళాయాత్రకు పూనుకున్నారు. ఏ ప్రభుత్వాలు సాయం అందించకున్నా మిత్రుల సహకారంతో యాత్రను విజయవంతంగా పూర్తి చేసి కొద్దిరోజుల్లో ముగించనున్నారు. ముగింపు సభను అతడి మిత్రులే నిర్వహిస్తున్నారు. లైవ్‌ డ్రాయింగ్‌లో దేశంలోని 28 రాష్ట్రాల్లో కళాయాత్ర నిర్వహించి ఎన్నో అవార్డులు, రికార్డులు సొంతం చేసుకున్న తెలంగాణ బిడ్డ పోచంకు ప్రభుత్వం ఏదైనా ఉద్యోగమిచ్చి ఆదుకుంటుందని ఆశిద్దాం.

నా జన్మ ధన్యమైంది



కళే నా ప్రాణంగా యాత్ర ప్రారంభించాను. చేతిలో చిల్లిగవ్వ లేకున్నా ఏడేళ్లు నిరంతరం యాత్ర కొనసాగించాను. చిత్రకళ ప్రాముఖ్యతను దేశవ్యాప్తంగా తెలియజేయాలని చేపట్టిన యాత్ర కొద్దిరోజుల్లో విజయవంతం కానుంది. ఇందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటా. జూన్‌ 7న కన్యాకుమారిలోని వివేకానంద రాక్‌ మెమోరియల్‌లో ముగింపు సభను నా మిత్రులు ఏర్పాటు చేశారు. ఓ కళాకారుడికి ఇంతకన్నా ఏం కావాలి. నా జన్మధన్యమైంది.

– ఏల్పుల పోచం, లైవ్‌ డ్రాయింగ్‌ కళాకారుడు, చెన్నూర్‌

విద్యుత్‌ స్తంభం విరిగిపడి మూడేళ్ల చిన్నారికి గాయాలు



గాయాలపాలైన చిన్నారి చైత్ర

సారంగపూర్‌: మండలంలోని కౌట్ల(బీ) గ్రామంలోని శాంతినగర్‌ కాలనీకి చెందిన మెండ్ల శ్రీను–లక్ష్మి దంపతుల మూడేళ్ల కుమార్తె చైత్రపై శుక్రవారం విద్యుత్‌ స్తంభం విరిగిపడగా తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శాంతినగర్‌కాలనీకి చెందిన రాథోడ్‌ గంగాధర్‌ విద్యుత్‌ అధికారుల అనుమతి తీసుకోకుండా తీగలు తగులుతున్నాయనే కారణంతో చెట్టుకొమ్మలు నరికివేశాడు. ఈక్రమంలో చెట్టుకొమ్మలు విద్యుత్‌ తీగలపై పడ్డాయి. వాటి బరువుకు స్తంభం విరిగి ఇంటిముందు ఆడుకుంటున్న చైత్ర కాలుపై పడింది. దీంతో చిన్నారికి కాలు, తలకు బలమైన గాయాలయ్యాయి. తల్లిదండ్రులు వెంటనే చిన్నారిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. తమ అనుమతి లేకుండా చెట్టు నరికి ప్రమాదానికి కారకుడైన గంగాధర్‌పై ట్రాన్స్‌కో ఏఈ సాయికిరణ్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై చంద్రమోహన్‌ గంగాధర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూపీఎస్సీ ర్యాంక్‌ సాధించడం అభినందనీయం



శుభంగౌడ్‌ను సన్మానిస్తున్న నర్సాగౌడ్‌

ఇంద్రవెల్లి: గౌడ సమాజానికి చెందిన రేకుల్‌వార్‌ శుభంగౌడ్‌ యూపీఎస్సీ సివిల్‌ సర్వీస్‌కు ఎంపిక కావడం అభినందనీయమని తెలంగాణ మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్‌ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ముత్నూర్‌ గ్రామంలో శుభంగౌడ్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శుభంగౌడ్‌ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. నాయకులు ఆరుకుల సంతోష్‌గౌడ్‌, సుంకరి శ్రీశైలంగౌడ్‌, కుంట రవి, చందర్‌గౌడ్‌, బాబాగౌడ్‌, లింగాల సంతోష్‌, శ్రీనివాస్‌గౌడ్‌, కిష్టగౌడ్‌, అరుణ్‌గౌడ్‌, శిరీష్‌కుమార్‌ తదితరులున్నారు.

కలుషితనీరు తాగి 20మందికి అస్వస్థత



108లో గ్రామస్తులను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

నార్నూర్‌: గాదిగూడ మండలంలోని లోకారి–బీ గ్రామంలో కలుషిత నీరు తాగి 20మంది అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఉదయం గ్రామస్తులకు వాంతులు, విరేచనాలు కావడంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. అస్వస్థతకు గురైన 20 మందిని అంబులెన్స్‌లో ఆదిలాబాద్‌ రిమ్స్‌కు తరలించి మెరుగైన వైద్య సేవలు అందించినట్లు 108 పైలట్లు వసీం, ముజాఫర్‌, ఈఎంటీలు దీపక్‌, కృష్ణ, రవి తెలిపారు. కాగా, గ్రామంలో కలుషితనీరు తాగడంతో చాలామంది వాంతులు, విరేచనాలతో బాధ పడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. రెండురోజుల క్రితం కురిసిన వర్షంతో పాటు గ్రామ సమీపంలోని బావి నీరు తాగడంతోనే విరేచనాలు అవుతున్నట్లు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఝరి పీహెచ్‌సీ వైద్యాధికారి సంజీవ్‌ గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో ఎలాంటి సమస్య లేదని, పరిస్థితి అదుపులోనే ఉందని ఆయనతో పాటు గ్రామ పెద్ద మెస్రం శేఖర్‌ బాబు తెలిపారు.



రిమ్స్‌లో గ్రామస్తులకు చికిత్స చేస్తున్న వైద్యులు, పరిశీలిస్తున్న డైరెక్టర్‌

రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితులు

ఆదిలాబాద్‌టౌన్‌: గాదిగూడ మండలంలోని లోకారి(బీ) గ్రామంలో 20 మందికి శుక్రవారం వాంతులు, విరేచనాలయ్యాయి. విషయం తెలుసుకున్న వైద్యారోగ్యశాఖ గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసింది. అయినప్పటికీ పరిస్థితి విషమించగా వారి కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌ ఆస్పత్రికి తీసుకువచ్చారు. వీరిలో తొమ్మిదిమంది మహిళలు, ఆరుగురు పురుషులున్నారు. ఐదుగురు చిన్న పిల్లలూ ఉన్నారు. కాగా, రిమ్స్‌ డైరెక్టర్‌ జైసింగ్‌ రాథోడ్‌ వారికి ప్రత్యేక బెడ్లు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు. కలుషిత నీటితోనే ఈ ఘటన జరిగి ఉండవచ్చని వైద్యాధికారులు చెబుతున్నారు.

పిల్లలకు పరీక్ష.. పెద్దల నిరీక్షణ



నిర్మల్‌ జిల్లా కేంద్రంలో శుక్రవారం పాలిసెట్‌ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. కాగా, వీరి వెంట వచ్చిన తల్లిదండ్రులు పరీక్ష పూర్తయ్యే దాకా ఇలా కేంద్రం బయట కూర్చుండి నిరీక్షించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్‌, నిర్మల్‌





రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



అమతరావ్‌ మృతదేహం

కడెం: మండలంలోని ఉడుంపూర్‌ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో ఈ నెల 23న జరిగిన రోడ్డు ప్రమాదంలో పెంద్రం అమతరావ్‌ (56) మృతి చెందాడు. మండలంలోని రాంపూర్‌, మైసంపేట్‌ పునరావాస కాలనీకి చెందిన పెంద్రం అమతరావ్‌, ఆడ నాగోరావ్‌ ఇద్దరు కలిసి బైక్‌పై ఈ నెల 23న ఆదిలాబాద్‌ జిల్లాలోని జంగుబాయి దేవాలయానికి వెళ్లి సాయంత్రం తిరుగుపయనమయ్యారు. బీర్సాయిపేట్‌–ఉండుంపూర్‌ మధ్యలో ఈదురుగాలులకు రహదారికి అడ్డంగా విరిగిపడ్డ చెట్టును వీరి బైక్‌ ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌ వెనకాల కూర్చున్న అమతరావ్‌ కింద పడడంతో తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే ఉట్నూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఆదిలాబాద్‌ రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. అమత్‌రావు భార్య రుక్మాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు.

ఉరేసుకుని ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్‌: ఆదిలాబాద్‌ పట్టణంలోని కైలాస్‌నగర్‌కు చెందిన పోతన్న (56) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ముజాహిద్‌ తెలిపిన వివరాల ప్రకారం.. పోతన్న కొన్నేళ్లుగా అప్పుల బాధ, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఇదే క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. మనస్తాపం చెందిన ఆయన శుక్రవారం ఆదిలాబాద్‌రూరల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని యాపల్‌గూడ శివారు ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని రిమ్స్‌ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పులిమడుగులో మహిళ..

ఉట్నూర్‌రూరల్‌: మండలంలోని పులిమడుగులో ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న రాథోడ్‌ మాయ (30) శుక్రవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఉట్నూర్‌ ఎస్సై మనోహర్‌ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మూడేళ్ల క్రితం మాయ భర్త రాథోడ్‌నరేశ్‌ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి మాయ ముగ్గురు పిల్లలను పోషిస్తూ ఆర్థిక ఇబ్బందులు పడుతోంది. ఈ క్రమంలో మాయ శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పెద్దకుమారుడు రాంకుమార్‌ గమనించి చుట్టుపక్కల వారికి తెలిపాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉట్నూర్‌ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లి జాదవ్‌ అనుసాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జొన్న లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా

భైంసారూరల్‌: మండలంలోని మిర్జాపూర్‌ గ్రామ సమీపంలో జొన్న లోడ్‌తో వెళ్తున్న లారీ శుక్రవారం బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుంటాల పీఏసీఎస్‌ కొనుగోలు కేంద్రం నుంచి జొన్నల లోడ్‌తో కుభీర్‌ మండలంలోని పల్సి గ్రామానికి వెళ్తున్న లారీ భైంసా మండలంలోని మిర్జాపూర్‌ గ్రామ సమీపంలో గేదెలను తప్పించే క్రమంలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌ రఫీక్‌మహ్మద్‌ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డాడు.

గిన్నెర చెరువులో మహారాష్ట్ర వాసి గల్లంతు



నితిన్‌ (ఫైల్‌)

ఇంద్రవెల్లి: మండలంలోని గిన్నెర పంచాయతి పరిధిలోని చెరువులో మహారాష్ట్ర వాసి గల్లంతయ్యాడు. అతడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని ఎవత్‌మాల్‌ పట్టణానికి చెందిన కుడ్మెత నితిన్‌ (40) బంధువులతో కలిసి మండలంలోని గిన్నెర పంచాయతీ పరిధి తోయగూడ గ్రామంలో గురువారం నిర్వహించిన కనక వంశీయుల కుల దేవత పూజలకు హాజరయ్యాడు. శుక్రవారం ఉదయం బంధువులతో కలిసి గ్రామ సమీపంలోని చెరువుకు స్నానానికి వెళ్లాడు. ఈక్రమంలో బహిర్భూమికి వెళ్లిన నితిన్‌ ఎంతకూ తిరిగి రాలేదు. బంధువులంతా గాలించగా చెరువు కట్ట పరిసర ప్రాంతంలో అతడి దుస్తులు కనిపించాయి. నితిన్‌ స్నానానికి వెళ్లి గల్లంతై ఉంటాడని అనుమానంతో గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చెరువు వద్దకు వెళ్లి పరిసర ప్రాంతాలను పరిశీలించినా ఆచూకీ దొరకలేదు. శనివారం గజ ఈతగాళ్లను రంగంలో దింపి మృతదేహాన్ని బయటకు తీస్తామని ఎస్సై సునీల్‌ తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సందీప్‌

తానూరు: మండలంలోని కోలూరు గ్రామానికి చెందిన దేవ్‌రే మారుతి (45) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మారుతి గతేడాది కూతురి పెళ్లికి రూ.10లక్షల వరకు అప్పుచేశాడు. అప్పులు ఎలా తీర్చాలని తరచూ ఆవేదనకు లోనయ్యేవాడు. ఈక్రమంలో అప్పులు తీర్చే మార్గం కనిపించక మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 22న సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయి కోలూరుతండా నుంచి మసల్గ వెళ్లే రోడ్డు పక్కనున్న వ్యవసాయ బావిలో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కొంతమంది రైతులు మృతదేహాన్ని గమనించి కుటుంబీకులు, పోలీసులకు సమాచారం అందించారు. శుక్రవారం పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని వెలికితీశారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు బైక్‌ ఢీ.. ఒకరి దుర్మరణం



సంతోష్‌ (ఫైల్‌)

లోకేశ్వరం: మండలంలోని మొహళ ఎక్స్‌ రోడ్డు వద్ద కారు బైక్‌ ఢీకొన్న ఘటనలో భైంసా మండలం తిమ్మాపూర్‌ గ్రామానికి చెందిన కత్తి సంతోష్‌ (45) మృతి చెందాడు. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. భైంసా మండలం తిమ్మాపూర్‌ గ్రామానికి చెందిన కత్తి సంతోష్‌ శుక్రవారం సాయంత్రం తన బైక్‌పై లోకేశ్వరం మండలం పంచగుడి గ్రామంలోని బంధువుల ఇంటికి బయలుదేరాడు. ఇతడి బైక్‌.. నందిపేట్‌ మండలం బద్గుణ నుంచి ఎదురుగా అతివేగంగా వస్తున్న కారు మండలంలోని మొహళ ఎక్స్‌ రోడ్డు వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సంతోష్‌ తలకు తీవ్ర గాయాలు కాగా, వెంటనే అంబులెన్స్‌లో నిర్మల్‌ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. సంతోష్‌కు భార్య నర్సవ్వ, కుమారుడు అఖిలేశ్‌, కుమార్తె అపర్ణ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించామని ఎస్సై తెలిపారు.

అడవి రేగు.. ఆరోగ్యానికి మేలు



నిర్మల్‌ జిల్లా కేంద్రం సమీపంలోని అటవీ ప్రాంతంలో అడవి రేగు చెట్లు కాతకు వచ్చాయి. ఈ పండ్లు తీయగా, కాసింత పులుపుతో అతి మధురంగా ఉంటాయి. ఇవి సహజ సిద్ధంగా కాసినందున ఔషధ గుణాలు పుష్కలంగా ఉంటాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నేరుగా తినడంతోపాటు పచ్చడి పెట్టుకుని లేదా ఎండబెట్టి కూడా తినొచ్చని స్థానిక అటవీ క్షేత్ర డిప్యూటీ రేంజ్‌ అధికారి మహ్మద్‌ నజీర్‌ఖాన్‌ వివరించారు.

– నిర్మల్‌ఖిల్లా